క్లుప్తంగా

సబ్‌కలెక్టర్‌ను కలిసిన పత్తికొండ ఆర్డీఓ



సబ్‌కలెక్టర్‌కు పూల మొక్కను అందజేస్తున్న పత్తికొండ నూతన ఆర్డీఓ భరత్‌నాయక్

ఆదోని రూరల్: పత్తికొండ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన భరత్‌నాయక్ ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పూల మొక్క అందజేశారు.

ఎమ్మెల్యేను కలిసిన సబ్‌రిజిస్ట్రార్



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసిన కోసిగి సబ్ రిజిస్ట్రార్ బజారి

కోసిగి: కోసిగి సబ్ రిజిస్ట్రార్‌గా బజారి ఇటీవల బదిలీపై వచ్చి కోసిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆయన డోన్ నుంచి ఇక్కడికి వచ్చారు. బుధవారం ఆయన రాంపురంలోని ఎమ్మెల్యే స్వగృహంలో మంత్రాలయం నియోజకవర్గ ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి , వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెట్టన గౌడ, డాక్యుమెంట్ రైటర్ నరసింహా మూర్తి స్వామి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఆదోని రూరల్: ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 'పల్లె పండగ వారోత్సవాలు' సందర్భంగా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో డ్రైనేజీలు, సిమెంట్ రోడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులు రూ.2 కోట్లతో చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఈఓపీఆర్డీ జనార్ధన్, ఏపీఓ కలీం తదితరులు పాల్గొన్నారు.

446 మంది గర్భిణులకు స్కానింగ్



స్కానింగ్ పరీక్షల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో గర్భిణులు వచ్చారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, కోసిగి మండలాల నుంచి స్కానింగ్ పరీక్షల పెద్ద సంఖ్యలో గర్భిణులు ఉదయమే ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. 446 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరిండెంట్ డాక్టరు సుధా చెప్పారు. డాక్టర్లు సుజిత, ఫాతీమా ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



చెత్త తొలగింపు పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో శక్తి గుడి ఏరియా, 13వ వార్డు కార్వన్‌పేట, హవన్నపేట, కొడల్‌పేట ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు బుధవారం విస్తృతంగా పర్యటించారు. చెత్త తొలగింపు, మురుగు కాలువల్లో పూడికను ఎత్తివేసే పనులను కమిషనర్ పరిశీలించారు. రోడ్లపై చెత్త కుప్పలు, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని శానిటేషన్ సిబ్బంది చేత తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అంటువ్యాధులు దూరమవుతాయని, ఈవిషయాన్ని పట్టణ ప్రజలు గమనించి, ఇంటి వద్దకు వచ్చే తోపుడు బండ్లు, ట్రాక్టర్లలో చెత్తను వేయాలన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

ఆదోని రూరల్: గ్రామ పంచాయతీ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండేలా పంచాయతీ కార్యదర్శులు చూసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు, విస్తరణాధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులతో డివిజనల్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఆర్-వన్ యాప్‌లో ఉన్న 16 సర్వీసుల గురించి క్షుణ్ణంగా వివరించారు. అందులో విజిబుల్ అసెట్స్‌లో తప్పులు ఉన్న వాటిని తొలగించి సరి చేయాలన్నారు.

సహకారం కరువాయే!

- పాలకవర్గం లేక పడకేసిన టౌన్‌బ్యాంక్ సేవలు
- నిలిచిపోయిన రుణాల మంజూరు, రికవరీలు
- రుణాలు అందక చిన్న వ్యాపారుల ఇబ్బందులు



ఎమ్మిగనూరు కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకు

ఎమ్మిగనూరు: చిన్న, మధ్య తరగతి వ్యాపారాలకు చేయూతనిస్తూ దశాబ్దాలుగా ప్రజాబ్యాంకుగా పేరుగాంచిన ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇంతవరకూ పాలకవర్గం ఏర్పాటు చేయకపోవటంతో సామాన్యుడికి బ్యాంకు సేవలు దూరమయ్యాయి. చిరువ్యాపారులకు, చేనేతలు, రైతులు, సామాన్యులకు రుణాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

1946లో స్థాపితం..

స్వాతంత్ర్యానికి పూర్వమే 1946లో ఎమ్మిగనూరులో కో-ఆపరేటివ్ టౌన్‌బ్యాంకును పద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించారు. రూ.3వేలు మూలధనంతో 33 మంది సభ్యులతో ఏర్పాటైన బ్యాంకు అంచలంచెలుగా వృద్ధిలోకి వచ్చింది. టౌన్‌బ్యాంకు ఏర్పాటు కాక మునుపు ఎమ్మిగనూరులో వారం వడ్డీ వ్యాపారుల చేతిలో చేనేతలు, చిరు, మధ్యతరగతి వ్యాపారులు నలిగిపోయేవారు. టౌన్ బ్యాంకు ఏర్పాటుతో చేనేత, సహకార రంగాలు వృద్ధిలోకి వచ్చాయి. అనంతరం భారతీయస్టేట్‌బ్యాంకు ఏర్పాటైనప్పటికీ స్థానిక వ్యాపారాలకు టౌన్‌బ్యాంకే లావాదేవీలే కేంద్రమయ్యాయి.

15వేల మంది సభ్యులు, రూ.32కోట్ల టర్నోవర్

ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకు సేవలు దశాబ్దాలుగా పట్టణ, గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. రూ.3వేల మూలధనంతో మొదలై నేడు 15వేల మంది సభ్యులతో రూ.32కోట్ల టర్నోవర్‌కు చేరింది. రూ.16కోట్లు డిపాజిట్లు, రూ.11కోట్లు రుణాలుగా ఇవ్వగా, బ్యాంకుకు రూ.8కోట్లు సొంత ఆస్తులున్నాయి. ప్రస్తుతం బ్యాంక్‌లో సెక్యులర్ లోన్‌ల కింద వ్యాపార, హౌసింగ్, క్యాష్‌క్రెడిట్, చిన్న వ్యాపార, బంగారం తనఖా లోన్లు ఇస్తున్నారు. చేయూత లోన్ల కింద షూరిటీ, శాలరీ, వెహికల్, గృహోపకరాల కొనుగోలుకు రుణాలు ఇచ్చేవారు. సెక్యూర్‌లోన్‌లు 13శాతం వడ్డీతో, గోల్డ్ లోన్‌లు 11 శాతం, చేయూత లోన్లు 10శాతం వడ్డీతో ఇస్తున్నారు.

కొత్త లోన్లు ఇవ్వడం లేదు

2008 నుంచి టౌన్‌బ్యాంక్ లాభాల్లోనే నడుస్తోంది. ప్రస్తుతం 6 నెలలుగా పాలకవర్గంలేక పోవడంతో డీసీఓ శశిరేఖ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. సెక్యూరిటీ లోన్లు మాత్రమే ఇస్తున్నాం. రికవరీ లేకపోవడంతో చేయూత లోన్లు ఇవ్వడం లేదు. కొత్తపాలక వర్గం వస్తే అందుకు అనుగుణంగా బ్యాంకు కార్యకలాపాలు ఉంటాయి.

– జి. కళ, టౌన్‌బ్యాంక్ సెక్రటరీ

అంతా ఇన్‌చార్జ్‌ల పాలనే..

ఎమ్మిగనూరు టౌన్‌బ్యాంకులో ఆది నుంచీ ఇన్‌చార్జ్ పాలనలో కొనసాగుతోంది. 1994లో ప్రత్యక్ష ఎన్నికల ద్వారా పాలక వర్గం ఏర్పాటు కావడం మినహా మిగిలిన కాలమంతా ఇన్‌చార్జ్‌ల పాలనలో నడిచింది. కొంతకాలం నామినేటెడ్ పాలనను కొనసాగించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటివరకూ డీసీఓ శశిరేఖ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. పాలకవర్గం ఏర్పాటు కాక పోవడంతో చేయూతలోన్లు ఇచ్చేవారు కరువయ్యారు. చిన్నవ్యాపారులకు, వెహికల్‌లోన్లు, శాలరీలోన్లు, గ్రూపులోన్లు ఇవ్వాలంటే పాలకవర్గం ఆమోదం తప్పనిసరి. కానీ పాలక వర్గమే లేకపోవడంతో రుణాలు ఇవ్వడం మానేశారు. సుమారు రూ.5.17కోట్లు (16.5శాతం ఎన్‌పీలు) రుణాలు రికవరీ కావాల్సి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే స్పందించి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకుకు పాలకవర్గం ఏర్పాటు చేసి పాలనను గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఆదోని డీఎల్‌సీఓగా శిరీష

కర్నూలు (అగ్రికల్చర్) : సహకార శాఖ ఆదోని డివిజనల్ అధికారిగా శిరీషను నియమిస్తూ సహకార శాఖ కమిషనర్ బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె ప్రస్తుతం సహకార శాఖ జిల్లా ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. శిరీషను పూర్తి అదనపు బాధ్యతలతో ఆదోని డీఎల్‌సీఓగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆదోని డీఎల్‌సీఓగా పనిచేస్తున్న షేక్ జఫ్రీన్ కర్నూలు డీఎల్‌సీఓగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమె నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ఏషియన్ పసిఫిక్ డఫ్ టెన్నిస్ టోర్నీలో పాల్గొననున్నారు. జాతీయ, అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వీలుగా కోచింగ్ తీసుకునేందుకు ప్రత్యేక కేసుగా పరిగణించి డివిజన్ నుంచి కర్నూలు డివిజన్‌కు బదిలీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా కింద సహకార శాఖలో గ్రూప్-1 స్థాయి డిప్యూటీ రిజిస్టర్‌గా పోస్టింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే.

నేటి నుంచి ఆర్‌యూకు సెలవులు

కర్నూలు కల్చరల్: దసరా పండుగను పురస్కరించుకొని రాయలసీమ యూనివర్సిటీకి సెలవులు ప్రకటిస్తూ సర్కులర్ జారీ చేశారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 14వ తేదీన వర్సిటీ పునఃప్రారంభమవుతుందని పేర్కొన్నారు. 10వ తేదీన సెలవు దినాన్ని భర్తీ చేసేందుకు వచ్చే రెండు నెలల్లో ఒక రెండో శనివారం పనిచేయాల్సి ఉంటుందని సర్కులర్‌లో పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



పత్తి రైతుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎలాంటి మోసాలు జరగకుండా, రైతులకు సమస్యలు ఎదురు కాకుండా చూడాలని యార్డు అధికారులను సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. బుధవారం మార్కెట్‌యార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మార్కెట్‌యార్డులో కలియ తిరిగారు. గత వారంలో గంటపాటు వర్షానికి వేరుశనగకాయలు కొట్టుకుపోయిన ప్రాంతంలో డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీకి మరమ్మతులు, నూతన నిర్మాణాలు వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. అనంతరం కార్యాలయంలో రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేసి రైతులతో మాట్లాడారు. ఏదైనా సమస్య ఉంటే యార్డు అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ ఉప తహసీల్దార్ వలీబాషా, యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే గుర్తింపు



మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు దంపతులను సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పేదలను ఆదుకొవడం, కష్టాల్లో వున్న బాధితులను సామాజిక సేవతో చేయూతనందించడం ద్వారానే తగిన గుర్తింపు వస్తుందని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిక్కంజానయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఏపీ వీరన్న అన్నారు. మల్లెల గ్రూప్ అధినేత, సామాజిక వేత్త డాక్టర్ మల్లెల అల్‌ఫ్రెడ్ రాజు, సునీలమ్మ దంపతులను బుధవారం స్థానిక కుర్ణి కళ్యాణ మండపంలో పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభ భారతి, సామాజిక సేవకుడు యు.రాము ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ అనాథలు, వికలాంగులు తదితరులకు మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు దంపతులు చేయూతనందించడమే కాకుండా ఇటీవల విజయవాడ వరద బాధితులను ఆదుకోనేందుకు కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు మనోహర్, ఆదెన్న, నరసన్న, రామకృష్ణ, లక్ష్మన్న, నాగరాజు, సల్మాన్ పాల్గొన్నారు.

16లోపు అందుబాటులోకి ఇసుక రీచ్

కర్నూలు న్యూసిటీ: ఈ నెల 16వ తేదీలోపు మరళి- 1 ఇసుక రీచ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గనులు, భూగర్భ ఖనిజాల శాఖ ఉప సంచాలకులు వి.రవిచంద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి ఇసుక రీచ్‌ను పరిశీలించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక కొరతను అధిగమించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మరో ఇసుక రీచ్ మరళి-1ను ప్రారంభించేందుకు జిల్లా ఇసుక నియంత్రణ కమిటీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దాదాపు 4.84 హెక్టార్లలో రీచ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఇసుక రీచ్‌లలో పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి పారుదలశాఖ ఆధ్వర్యంలో యంత్రాల ద్వారా ఇసుక వెలికి తీస్తున్నారన్నారు. వెలికి తీసిన ఇసుకను రిజిస్ట్రేషన్ కలిగిన వాహనాలకు చలానాల నింపుతున్నారు. అక్కడి నుంచి ఇసుక ధరతో పాటు రవాణా చార్జీలు ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా చెల్లించిన వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ రీచ్‌లో కాంట్రాక్టర్ల ద్వారా ఇసుకను వెలికి తీసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నది నుంచి ఇసుకను బయటకి తీసిన కాంట్రాక్టర్‌కు క్వింటా ఇసుకకు రూ.109 చెల్లించేలా ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాలన్నింటినీ డిస్ట్రిక్ లెవెల్ శాండ్ కమిటీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు.

వీధి దీపాల ఏర్పాటు



ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : పెద్దకడబూరు మేజర్ పంచాయతీలో బుధవారం సర్పంచ్ రామాంజినేయులు ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పంచాయతీలో ఇప్పటి వరకు దాదాపుగా 220కి పైగా వీధి దీపాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంకా ఎక్కడైనా వీధి దీపాలు లేక చికట్లో ఉండిఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే తక్షణమే అక్కడ లైట్లను ఏర్పాటు చేస్తామన్నారు



పెద్దకొత్తిలి రైతు భరోసా కేంద్రంపై మాజీ సీఎం చిత్రాన్ని ధ్వంసం చేసిన దృశ్యం (వృత్తంలో)

ఆగని విధ్వంసం



గ్రామ సచివాలయంపై ..



విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌పై..

నందవరం: గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలు, ఆర్బీకేలపై టీడీపీ నాయకుల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే అక్కసుతో టీడీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే పనిలో పడింది. సచివాలయాలను కుదించడమే గాక వాటిపై సృష్టికర్త ఫొటోలను సైతం తొలగించారు. లోగోలను ధ్వంసం చేయడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందవరం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, గురజాల గ్రామాలలోని సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వీలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లపై ముద్రించిన మాజీ సీఎం వైఎస్ జగన్ లోగోలను ధ్వంసం చేశారు. రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సరస్వతి అలంకరణలో దొండు మారెమ్మవ్వ



సరస్వతిదేవిగా ఫారెస్టు లైన్ అంబా భవానీమాత



ఎమ్మిగనూరులోని వీవర్స్ కాలనీలో సరస్వతిదేవి అలంకరణ

సరస్వతీ.. నమస్తుభ్యం



అమ్మవారి సన్నిధిలో మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు వై. సీతారామిరెడ్డి



సోమలగుడూరులో సరస్వతీ దేవి అలంకరణలో పూజలందుకుంటున్న అమ్మవారు



కందుకూరులో సరస్వతి దేవి అలంకరణ

ఎమ్మిగనూరుటౌన్: దేవి శరన్నవ రాత్రుల మహోత్సవంలో భాగంగా ఏడవ రోజైన బుధవారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన మండపంలో సరస్వతి దేవి రూపంలో అమ్మవారు భక్తుల పూజలందుకున్నారు. పట్టణంలోని తేరు బజారులో శ్రీరామలింగేశ్వర చౌడేశ్వరి ఆలయంలో, వేదగాయిత్రీ దేవి ఆలయంలో, తేరు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారిని, అంబాభవాని ఆలయాలతో పలు అలంకారాల్లో దర్శనమిచ్చారు.

నందవరం : మండలంలోని సోమలగుడూరు గ్రామంలో పెద్దమ్మ తల్లిని సరస్వతీ దేవిగా పురోహితులు శ్రీధర్‌స్వామి, భక్తులు అలంకరణ గావించారు. విద్యార్థులు, భక్తులు అమ్మవారి చెంత పుస్తకాలు ఉంచి ప్రత్యేక పూజాలు నిర్వహించి హారతులనిచ్చారు.

మంత్రాలయం: మండలకేంద్రంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో దుర్గమాత సరస్వతి దేవిగా భక్తుల దర్శనమిచ్చారు. బుధవారం మాజీ టీటీడీ పాలకమండలి సభ్యులు వై. సీతారామిరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నారాయణ శెట్టి, ఎంపీటీసీ వెంకటేష్ శెట్టిల ఆధ్వర్యంలో ఆయనకు శాలువా పూలమాలలు వేసి సన్మానించారు.

కోసిగి: కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. బుధవారం ఆలయంలో ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ గావించారు.

పెద్దకడబూరు : మండల పరిధిలోని దొడ్డిమేకల గ్రామంలోని శివాలయంలో వెలసిన పార్వతీదేవి అమ్మవారు రాజరాజేశ్వరి దేవీగా భక్తులకు కనువిందు చేశారు. మండల కేంద్రంలోని కాళీమాత, చౌడేశ్వరిదేవి, పెద్ద లక్ష్మమ్మవ్వ వివిధ రూపాలలో భక్తులకు దర్శమిచ్చారు.

ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలో కొలువైన అమ్మవార్లు, స్వామివార్లు బుధవారం వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ వారు కొబ్బరి తురుము అలంకారంలోనూ, అలాగే సరస్వతి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, శివమూర్తి అలంకారంలో శ్రీ నగరేశ్వరస్వామి వారు, ద్రాక్ష గోడంబి అలంకారంలో శ్రీ పేట వీరభద్రస్వామివారు, సరస్వతిదేవి అలంకారంలో ఫారెస్ట్ లైన్ అంబా భవానీమాత దర్శనమిచ్చారు.

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో వెలసిన అంబాభవాని ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మండలంలోని నెట్టేకల్ గ్రామానికి వెళ్లే రహదారిలో వెలిసిన దొండు మారెమ్మవ్వ వారిని సరస్వతి దేవిగా అలంకరించారు.



ద్రాక్షా, గోడంబి అలంకారంలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి



దొడ్డిమేకలలో రాజరాజేశ్వరి దేవిగా పార్వతీదేవి



కొబ్బరి తురుముతో మహాయోగి లక్ష్మమ్మవ్వ వారు



సరస్వతిమాతగా వాసవీ కన్యకా పరమేశ్వరి



శివమూర్తి అలంకారంలో నగరేశ్వరస్వామి

12 మద్యం షాపులకు 172 దరఖాస్తులు

ఆదోనిటౌన్: ఆదోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 12 మద్యం షాపులకు బుధవారం వరకు 172 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా.. ప్రభుత్వం మరో రెండు రోజులు గడవును ప్రభుత్వం పెంచిందని, దరఖాస్తులకు 11వ తేదీని చివరి తేదీగా ప్రకటించిందని చెప్పారు. ఆదోని పట్టణంలో ఎనిమిది షాపులు, ఆదోని రూరల్‌లో రెండు షాపులు, కౌతాళంలో రెండు షాపులు మొత్తం 12 షాపులకు గానూ 172 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామని ఎక్సైజ్ సీఐ తెలిపారు. మరో రెండు రోజులు గడువు ఉండడంతో 20, 30 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. 172 దరఖాస్తులకు రూ.34.40 కోట్లు డిపాజిట్ వచ్చినట్లు చెప్పారు.

మద్యం దుకాణాలకు 180 దరఖాస్తులు

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బుధవారం ఒక్కరోజే ఆఫ్‌లైన్, ఆన్‌లైన్లో 42 దరఖాస్తులుఊ వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 180 దరఖాస్తులు వచ్చినట్లు, ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పారు.

12వ పీఆర్సీని అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీని అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యేవరకూ 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2023 జూలై నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సివున్నా ఆచరణకు నోచుకోలేదన్నారు. పీఆర్సీ అమలులో జాప్యం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గతంలో జరిగిన నష్టాన్ని గుర్తించి మెరుగైన ఫిట్‌మెంట్‌ను ప్రకటించాలని కోరారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు దావీదు, ఎల్లప్ప, జయరాజు, యేహోషువ తదితరులు పాల్గొన్నారు.